# పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు ఇప్పించండి

- అనుమతులు సాధించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలం
- జాప్యంచేస్తే తెలంగాణకు అపార నష్టం
- బనకచర్ల ద్వారా నీళ్లు తరలిస్తే రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకొని అనుమతులు ఇప్పించి, తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కేంద్రమంత్రికి లేఖ రాశారు. అనుమతులు సాధించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి నీటిని తరలిస్తే తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రం మేలు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఏపీని నిలువరించాలని కేంద్రమంత్రిని కోరారు. గోదావరి-కృష్ణా బోర్టుల అనుమతి తీసుకోకుండా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించడంపై విస్మయం వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు రెండు లేఖలు రాయడంపై ఆందోళన వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రతిరోజూ 3 టీఎంసీలు ఎత్తిపోసే ప్రాజెక్టుల అనుమతులు పెండింగ్‌లో ఉండడం శోచనీయమని వ్యాఖ్యానించారు. సీతమ్మ సాగర్‌కు టీఏసీ(టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ) అనుమతులివ్వకుండా సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్‌కు ఎన్వోసీ జారీపై కేంద్రం జాప్యం చేయడం విడ్డూరమని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతుల సాధనకు కిషన్‌రెడ్డి కృషి చేయాలని విన్నవించారు. కేసీఆర్ పాలనలో మిషన్‌కాకతీయ కింద చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యాంల నిర్మాణంతో సాగునీటి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. కానీ వరద జలాల వినియోగం కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు టీఎంసీ నీరు ఎత్తిపోసే పథకానికి ఇప్పటివరకు అనుమతులు లభించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ పరిస్థితుల్లో కిషన్‌రెడ్డి గోదావరి జలాల్లో తెలంగాణ వాటా సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

# ఇదేనా కాంగ్రెస్ మార్కు పాలన?

- పథకాల అమలులో మాట మార్చడంపై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): పథకాల అమలులో ఎన్నిసార్లు మాట మారుస్తారని.. ఇదేనా కాంగ్రెస్ మార్కు పాలనా? అంటూ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 2023 డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి 2024 ఆగస్ట్ 15 వరకు రుణమాఫీ గడువు పొడిగించారని గుర్తు చేశారు. దసరా వరకు రుణమాఫీ అని చెప్పినా నేటికీ 20 లక్షల పైచిలుకు రైతులకు అందలేదని తెలిపారు. రైతుబంధు విషయంలోనూ కాంగ్రెస్ మాట తప్పిందని పేర్కొన్నారు. ఇప్పుడే తీసుకుంటే రూ.15వేల రైతు భరోసా అని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. వానకాలం రైతు భరోసా ఎగవేశారని.. సంక్రాంతికి ఇస్తామని మరోసారి మాట తప్పారని మండిపడ్డారు. తర్వాత జనవరి 26కి అందిస్తామని చెప్పి మళ్లీ ఇప్పుడు మార్చి 31 వరకు అనడం ఏంటని ఫైర్ అయ్యారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చి రైతులకు దన్నుగా నిలిచారని, రేవంత్‌రెడ్డి మాత్రం దాన్ని ఎగ్గొట్టి రైతులకు భరోసా లేకుండా చేశారని మండిపడ్డారు. ఆసరా పింఛన్ రూ.4వేలు, తులం బంగారం, మహిళలకు రూ.2,500, విద్యా భరోసా కార్డు, ఏడాదిలో 2లక్షల ఉద్యోగాలు నిరుద్యోగభృతి ఇవన్నీ ఇందిరమ్మ రాజ్యంలో ఏమయ్యాయో ఆ ఇందిరమ్మకే తెలియాలని ఎద్దేవా చేశారు.

# ఆర్టీసీలో సమ్మె సైరన్!

మొదటిపేజీ తరువాయి...

నుంచి సమ్మె తప్పదని హెచ్చరిక జారీ చేశాయి. ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల రద్దుతో పాటు ఎన్నాళ్ల నుంచో పెండింగ్‌లో ఉన్న సమస్యలు తీర్చాల్సిందేనని గత కొన్నాళ్లుగా టీజీఎస్ ఆర్టీసీ జేఏసీగా ఏర్పడిన కార్మిక సంఘాలు పట్టుబడుతున్నాయి. ఆర్టీసీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మెబాట పట్టేందుకు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు సోమవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మునిశేఖర్‌కు ఆర్టీసీజేఏసీ నేతలు సమ్మె నోటీసును అందించారు. మొత్తం 21 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుపెట్టారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 9 నుంచి సమ్మె చేస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు.



సోమవారం బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మునిశేఖర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆర్టీసీ జేఏసీ నేతలు, బస్‌భవన్ వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

### 14 నెలలైనా పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పట్టించుకోవడమే లేదని ఆర్టీసీ జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో డిపోలను ప్రభుత్వం ప్రైవేటు సంస్థల చేతుల్లో పెడుతుందని, దీంతో తాము ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయలేదని, 2021 పీఆర్సీ, 2017 పెండింగులో ఉన్న వేతన బకాయిల సమస్యలను పరిష్కరించనే లేదని చెప్పారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించకుండా, యూనియన్లను రద్దు చేసి, కార్మికుల పనిగంటలు పెంచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 22న జరిగిన ఆర్టీసీ జేఏసీ నేతల సమావేశంలో సమ్మె నోటీస్ ఇచ్చే విషయంపై నిర్ణయం తీసుకున్నామని ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్ కే యాదయ్య, ఎస్ సురేశ్, బీ యాదయ్య వివరించారు.

### భారీగా పోలీస్ బందోబస్తు

ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీస్ ఇచ్చేందుకు సోమవారం హైదరాబాద్ బస్‌భవన్‌కు వస్తారన్న సమాచారంతో పోలీసులు ముందుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ పోలీస్‌స్టేషన్లతోపాటు ప్రత్యేక దళాలను కూడా బస్‌బవన్ వద్ద మోహరించారు. సమ్మె నోటీస్ ఇచ్చేందుకు వచ్చిన కార్మిక సంఘాల నేతలను మాత్రమే లోపలికి అనుమతించారు.

### ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే

1. ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల ముందు, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేయాలి.
2. ఆర్థికపరమైన అంశాలను పరిష్కరిస్తూ, ప్రస్తుత సౌకర్యాలనే కొనసాగిస్తూ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలి.
3. 2021 వేతన సవరణను అమలు చేస్తూ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలి
4. 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించి, రిటైర్డ్ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయాలి.
5. కొత్త బస్సుల కొనుగోలు ద్వారా ఆర్టీసీని అభివృద్ధి పరిచి, ఆధునీకరించాలి.
6. సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ చేసి, రాయితీలకు, సంస్థ అభివృద్ధికి ప్రతి ఏటా బడ్జెట్‌లో 3 శాతం కేటాయించాలి.
7. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆర్టీసీకి ఇవ్వాలి.
8. యాజమాన్యం వాడుకున్న సీసీఎస్, ఎస్ఆర్‌బీఎస్, పీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేయాలి. సీసీఎస్‌లో ఎన్నికలు నిర్వహించి, కార్యాలయ సిబ్బంది ఖాళీలను భర్తీచేయాలి.
9. మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్ బదులు మహిళలకు స్మార్ట్‌కార్డు ఇవ్వాలి. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. ఈ స్కీమ్‌లో జరుగుతున్న సీ,టీ కేసుల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.
10. బ్రెడ్ విన్నర్, మెడికల్ ఇన్‌వాలిడేషన్ ఉద్యోగుల కుటుంబాలకు ఇచ్చే ఉద్యోగాలు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. ప్రస్తుతం కన్సాలిడేటెడ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. ప్రభుత్వ జీవో ఎంఎస్ నంబర్ 30 ప్రకారం వయోపరిమితిని 44 ఏండ్లకు పెంచాలి. ఈ స్కీమ్‌లో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ వంటి పోస్టులను కూడా ఇవ్వాలి.
11. అన్ని క్యాటగిరీలలో ఖాళీలను భర్తీచేసి అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలి.
12. ప్రతి కార్మికుడికి 21 రోజుల హాజరుతో ఇన్సెంటివ్ ఇవ్వాలి. బస్‌బాడీ బిల్డింగ్‌తో పాటు మిగతా వర్క్‌షాప్‌లను బలోపేతం చేయాలి.
13. తార్నాక దవాఖానలోని అన్ని విభాగాల్లో సిబ్బందిని రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. రోగులు, వారి వెంట వస్తున్న అటెండెంట్లకు భోజన వసతి సౌకర్యం కల్పించాలి.
14. ఆర్టీసీ ఉద్యోగులకు తార్నాక దవాఖానలో మెరుగైన వైద్యసౌకర్యాలను కల్పిస్తూ, ఉద్యోగి కుటుంబానికి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో కూడా వైద్యసౌకర్యం కల్పించాలి. రిటైరైన ఉద్యోగులకు మందులు సరఫరా చేయాలి. వైద్య పరీక్షలకయ్యే ఖర్చులను యాజమాన్యమే భరించాలి.
15. అకౌంట్స్ విభాగంలో సెంట్రలైజేషన్ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని కొనసాగించాలి. ఔట్‌సోర్సింగ్ ద్వారా కన్సల్టెన్సీ పేరున జరుగుతున్న ఆర్థిక దుబారాను అరికట్టాలి.
16. అన్ని యూనిట్లలో మహిళలతోపాటు పురుషులకు కూడా అన్ని వసతులతో పాటు తాగునీరు, వాహనాల పార్కింగ్‌కు సరిపడా షెడ్లు నిర్మించాలి.
17. పాత నిబంధనలను మార్చి డ్రైవర్, కండక్టర్, నిర్వహణ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి. అక్రమ సస్పెన్షన్ , రిమూవల్ అయినవారిని, అప్పీల్ రిజెక్ట్ అయినవారిని విధుల్లోకి తీసుకోవాలి.
18. టెస్ట్ పాసైన వారికి జూనియర్ అసిస్టెంట్ పోస్టింగ్ ఇవ్వాలి. మిగిలిన ఖాళీలకు డిపార్టుమెంట్ టెస్ట్‌లు నిర్వహించి భర్తీచేయాలి.
19. 2019o సమ్మెకాలంలో ఉద్యోగులపై నమోదుచేసిన కేసులను ఎత్తివేయాలి.
20. అద్దె బస్సు డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. పీఎఫ్ కాంట్రిబ్యూషన్ రికవరీ చేయాలి.
21. ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంటల పనిదినాలు (సిటీ సర్వీసులలో 7 గంటలు) అమలు చేసి మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటలలోపు పూర్తయ్యేలా డ్యూటీలు ఇవ్వాలి. ప్రతి కార్మికుడికి నెలకు 3 రోజులు సెలవులు మంజూరు చేయాలి.

### ప్రైవేటు బస్సులు సంస్థ మనుగడకే ప్రమాదం

ప్రైవేటు బస్సులు ఆర్టీసీలో ప్రవేశపెట్టి సంస్థ మనుగడకే ప్రమాదం కలిగేలా చేస్తున్నారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం సీఎం, మంత్రులు అందరినీ కలిశాం. అయినా మా సమస్యలను పరిష్కరించనేలేదు. గత ప్రభుత్వం విలీన ప్రక్రియను 90 శాతం పూర్తిచేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఎందుకు అమలు చేయడం లేదు? 2021 పీఆర్సీ ఇవ్వడంలేదు.14 నెలలు సమయం ఇచ్చాం. ఇక మాకు ఓపిక లేదు.

**- ఈదురు వెంకన్న, ఆర్టీసీ జాక్ చైర్మన్**

### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంచేయాలి. కార్మికుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి. 2021 పీఆర్సీని ప్రకటించి, 2017 బకాయిలను చెల్లించాలి. 15 రోజుల్లో యాజమాన్యం స్పందించి మా డిమాండ్లను నెరవేర్చాలి. త్వరలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఆర్టీసీ జాక్ ఆధ్వర్యంలో కలిసి, సమ్మెకు మద్దతును కూడగడుతాం. ప్రభుత్వమే ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**- ఎం థామస్‌రెడ్డి, ఆర్టీసీ జాక్ వైస్‌చైర్మన్**

### ప్రైవేటు పెట్టుబడిదారులకు ప్రజాధనం

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడం, ఆ బస్సులకు డిస్కౌంట్ పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని ప్రైవేటు పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారు. దీనికి ఎస్‌డబ్ల్యూసీ ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూసీ సీఐటీయూ పూర్తిగా వ్యతిరేకం. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు ప్రభుత్వాలు ఆర్థిక చేయూతను అందించాలి.

**- రాజిరెడ్డి, వీఎస్‌రావు, ఎస్‌డబ్ల్యూసీ (ఐఎన్‌టీయూసీ), ఎస్‌డబ్ల్యూసీ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శులు**

### ప్రైవేటు సంస్థల చేతుల్లోకి ఆర్టీసీ డిపోలు

ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో డిపోలను ప్రభుత్వం ప్రైవేటు సంస్థల చేతుల్లో పెడుతున్నది. ప్రైవేటు కంపెనీల ద్వారా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావడం వల్ల తమ ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉన్నదన్న ఆందోళన ప్రతిఒక్కరిలో నెలకొన్నది. ఇప్పటివరకు ఆర్టీసీ విలీనం గురించే పభుత్వం ఆలోచించడం లేదు. 2021 పీఆర్సీ, 2017 వేతన పెండింగ్ బకాయిల సమస్యలు పరిష్కరించనేలేదు.

**- ఎండీ మౌలానా, ఆర్టీసీ జాక్ కో-కన్వీనర్**

# మధ్యప్రదేశ్‌కు తరలిన రాష్ట్ర మంత్రివర్గం

- ఇద్దరు మంత్రులు మినహా అంతా ఇండోర్ బాట
- పాలనను గాలికొదిలేసి టూర్లకు వెళ్లడంపై విమర్శలు

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా దాదాపు రాష్ట్ర మంత్రివర్గం మొత్తం ఇండోర్‌కు వెళ్లింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఏఐసీసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్‌లోని మౌ గ్రామంలో 'సంవిధాన్ బచావో' ర్యాలీ నిర్వహించనున్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి ప్రత్యేక విమానంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఇతర మంత్రులు తరలివెళ్లారు. మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రమే రాష్ట్రంలో ఉన్నారు. వాస్తవానికి వారు కూడా వెళ్లాల్సి ఉన్నా.. మంత్రి శ్రీధర్‌బాబు స్విట్జర్లాండ్ పర్యటన ముగించుకొని సోమవారమే హైదరాబాద్ వచ్చారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనారోగ్యం కారణంగా ఆగిపోయినట్టు తెలిసింది. మరోవైపు వారం కిందట కర్ణాటకలో జరిగిన సంవిధాన్ బచావో కార్యక్రమానికి మంత్రులందరూ వెళ్లడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు విదేశాల్లో ఉండగా, మిగతా మంత్రులంతా కర్ణాటక బాట పట్టారు. పాలనను గాలికి వదిలేసి ఇలా మంత్రివర్గం మొత్తం దేశ, విదేశీ టూర్లు చేయడంపై ప్రజలు అసహనం వ్యక్తంచేశారు. పైగా ఆ సమయంలో గ్రామాల్లో నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక, గ్రామసభలతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అయినా మంత్రులంతా రాష్ట్రం వదిలి వెళ్లడంపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈసారి ఒక్కరినైనా రాష్ట్రంలో ఉంచి వెళ్లాలని ప్రభుత్వం భావించినట్టు సచివాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

# గోడదూకినోళ్లే సలహా'దారు'లు!

## నాడు వద్దని.. నేడు కావాలని • ప్రభుత్వ సలహాదారుల వ్యవస్థపై సీఎం రేవంత్ రెండు నాల్కలు

**తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని నాడు బీరాలు • ఏడాదిలో ఏకంగా 18 మంది సలహాదారులు, కన్సల్టెంట్ల నియామకం**

**సలహాదారుల వ్యవస్థను రాజకీయ పునరావాసంగా మార్చిన కాంగ్రెస్ • ముఖ్య నేత భార్య బొటిక్ కన్సల్టెంట్‌కు త్వరలో సీఈవోగా పదవీయోగం?**

**'రాష్ట్ర ప్రభుత్వానికి సలహాదారుల అవసరం ఏమున్నది? కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సలహాదారు వ్యవస్థను లేకుండా చేస్తాం' - 2022 జూలై 18న ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డిని విమర్శిస్తూ, 2023 మే 9న ప్రభుత్వ సలహాదారుగా మాజీ ఐఏఎస్ సోమేశ్‌కుమార్ నియామకాన్ని విమర్శిస్తూ నాటి పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి చేసిన వాఖ్యలివి.**

> **'రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించడంలో సలహాదారుల పాత్ర ఉన్నది. సలహాదారుల అవసరం లేదు' - బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన ఏడుగురు సలహాదారులను 2023 డిసెంబర్ 10న తొలిగించిన అనంతరం ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివి.**

హైదరాబాద్, జనవరి 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుతం 12 మంది సలహాదారులు, ముగ్గురు కన్సల్టెంట్లు, ముగ్గురు డైరెక్టర్లు ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నాల్కల ధోరణికి ఇది ప్రత్యక్ష నిదర్శనం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సలహాదారుల వ్యవస్థను రద్దు చేస్తామంటూ బీరాలు పలికిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే వ్యవస్థను నెత్తికెక్కించుకున్నారు. తన అత్యంత ఆప్తులకు, కాంగ్రెస్ అంసతృప్తులకు పునరావాసంగా, వ్యాపార ప్రయోజనాల కోసం ఈ వ్యవస్థను ఉపయోగించుకుంటున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంలో 12 మంది సలహాదారులు ఉన్నారు. ముగ్గురికి డైరెక్టర్లుగా, ముగ్గురుకి కన్సల్టెంట్లగా పదవులు కట్టబెట్టారు. వీరిలో ముఖ్యనేతలకు ఆప్తులు కొందరు కాగా, మరికొందరు రాజకీయ పునరావాసం కోటాలో అధిష్ఠానం ఆదేశాల మేరకు కుర్చీ అందుకున్నవారు ఉన్నారు. వీరి తోపాటు ఏపీ నేతలు ఒత్తిడి చేసి చొప్పించిన వాళ్లు కూడా ఉన్నరనే విమర్శలున్నాయి. వీరిలో ముగ్గురు నలుగురిని మినహాయిస్తే, మిగతావారు ఆయా రంగాల్లో నిపుణులు కారని, కనీస అర్హతలు కూడా లేవని అంటున్నారు. ఈ ప్రహసనం ఇంతటితో ఆగేటట్టు లేదని, మరింత మందిని సలహాదారులగా నియమించి క్యాబినెట్ హోదా కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.

### అధికారంలోకి వచ్చిన నెలన్నర నుంచే..

2023 డిసెంబర్ 7న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత మూడు రోజులకు 10న ఏడుగురు సలహాదారులను తొలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగించడంలో సలహాదారుల పాత్ర ఉన్నదని, తమ ప్రభుత్వానికి సలహాదారుల అవసరం లేదని చెప్పుకున్నారు. కానీ, జనవరి 20న అంటే అధికారంలోకి వచ్చిన నెలన్నరకు తనకు అత్యంత నమ్మకస్తుడైన వేం నరేందర్‌రెడ్డిని ప్రధాన సలహాదారుగా నియమించారు. క్యాబినెట్ హోదా కల్పించారు. ఆ తర్వాత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీకి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓబీసీ శాఖల ప్రధాన సలహాదారుగా నియమించి క్యాబినెట్ హోదా ఇచ్చారు. నిజానికి, ఆయన ఎమ్మెల్సీ పదవిని, మంత్రి పదవిని ఆశించారు. ఆ మేరకు ఢిల్లీ నుంచి హామీ కూడా తీసుకున్నారు. ఆయనను తాత్కాలికంగా చల్లబరచడం కోసం ప్రభుత్వ సలహాదారు పదవి కట్టబెట్టి పునరావాసం కల్పించారన్న విమర్శలు ఉన్నాయి. పార్లమెంటు ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఏపీ జితేందర్‌రెడ్డిని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా, బీఆర్ఎస్ నుంచి గోడదూకిన పోచారం శ్రీనివాసరెడ్డిని వ్యవసాయ శాఖ సలహాదారుగా, రాజ్యసభకు రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కేశవరావుని పబ్లిక్ ఎఫైర్స్ సలహాదారుగా, కాంగ్రెస్ పార్టీకే చెందిన సీనియర్ నేత హర్కర వేణుగోపాల్‌ను ప్రొటోకాల్, ప్రజా సంబంధాల సలహాదారుగా నియమించి, క్యాబినెట్ హోదా కట్టబెట్టారు. ఇలా రాజకీయ పునరావాసం, గోడదూకిన నేతల్లో ఆరుగురికి సలహాదారుగా నియమించారని విమర్శిస్తున్నారు. రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థిక నష్టం కలిగిస్తున్నారని అప్పట్లో చెప్పిన ముఖ్యమంత్రే అప్పులు తెచ్చి మరీ వారికి జీతభత్యాలు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. పైగా ఏ శాఖలో ఎంత మందిని నియమిస్తున్నారో, ఏ హోదాలో ఇస్తున్నారో అంతుచిక్కడం లేదని అంటున్నారు.

### ఏపీ అధికారులకూ అందలం!

ఏపీ నేతల సిఫారసు మేరకు ముగ్గురు అధికారులు తెలంగాణ ప్రభుత్వంలో చేరారని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్‌దాస్‌ను నీటి పారుదల వ్యవహారాల సలహాదారుడిగా క్యాబినెట్ హోదాలో ప్రభుత్వం నియమించింది. ఆయన ఏపీ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన నేపథ్యంలో నైపుణ్యపరంగా శంకించాల్సిన పని లేదు కానీ, ఆయన హయాంలోనే తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించుకుపోయారనే విమర్శలు ఉన్నాయి. దుమ్ముగూడెం, పోతిరెడ్డిపాడు, రాయలసీమ ఎత్తిపోతల పథకం అమలులో కూడా ఆయన కీలకపాత్ర పోషించారని అంటున్నారు. రాష్ట్రంలో అనేకమంది నీటిపారుదలరంగ నిపుణులు ఉండగా ఏపీకి చెందిన రిటైర్డ్ అధికారిని ఎందుకు నియమించారన్న ప్రశ్నలు ఉన్నా యి. ఏపీకి చెందిన శ్రీనివాసరాజును ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారుగా నియమించారు. శాసనసభ చరిత్రలోనే తొలిసారిగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శాసనసభ వ్యవహారాల సలహాదారు పోస్టును సృష్టించింది. సూర్యదేవర ప్రసన్నకుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. ఆయనను అగమేఘాల మీద ఢిల్లీ నుంచి తీసుకొచ్చి బాధ్యతలు అప్పజెప్పడం వెనుక ఎవరి హస్తం ఉన్నదనేది ప్రశ్నార్థకంగా మారింది.

## పెంటారెడ్డిని తిట్టి.. మళ్లీ ఆయనకే పదవి

2018లో అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్ర ఎత్తిపోతల పథకం సలహాదారుగా పెంటారెడ్డిని నియమించారు. ఈ నియామకంపై పీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాయలేని పదజాలంతో దూషించారు. 2022 జూలైలో 'పెంటారెడ్డి ఇంజినీరింగ్ చదివాడా? గాడిదలు కాసిండా?' అని రేవంత్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే పెంటారెడ్డికి సలహాదారుగా పదవీ కాలాన్ని పొడిగించి కొనసాగిస్తున్నారు. పెంటారెడ్డి పదవీకాలం మే15తో ముగియగా, ప్రభుత్వం ఆరో నెలలు పొడిగించింది. ఇప్పుడు మరోసారి పదవీ కాలాన్ని పొడించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డిని గతంలో ప్రజాభవన్ ఆదేశాలు శిరసావహించే వ్యక్తిగా రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. ఇప్పుడు కృపాకర్‌రెడ్డి పదవీకాలం ముగిసినా మళ్లీ ఈఎన్‌సీగా పదవీకాలాన్ని పొడగించడం గమనార్హం. మహిళా సాధికారత కోసం నెలకొల్పిన హబ్‌కు ఒక మహిళను సీఈవోగా నియమించారు. ఊరూపేరూ తెలియని వ్యక్తికి పదవి కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వంలోని ముఖ్య నేత భార్య రాష్ట్రంలోని సంపన్నుల కోసం నడిపిస్తున్న ఒక బొటిక్‌కు ఆమె కన్సల్టెంటుగా పని చేశారని, అందుకే పదవి దక్కిందనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్ఎండీ